## ప్రభుత్వ దవాఖానలో రోగి హల్‌చల్



దవాఖానలో హల్‌చల్ చేస్తున్న రోగి

కామారెడ్డి, జనవరి 15 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఓ రోగి కత్తెర పట్టుకొని హల్ చల్ చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. దవాఖాన వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమోద్ అనే వ్యక్తి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం దవాఖానలో చేర్పించారు. ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న ప్రమోద్ కత్తెర పట్టుకొని దవాఖానలో హల్‌చల్ చేశాడు. మద్యం లేకపోవడంతోనే ఇలా ప్రవర్తించి ఉంటాడని దవాఖాన సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బందికి చికిత్సకు సహకరించకపోవడంతో అతని కాళ్లు, చేతులు కట్టేసి చికిత్స అందిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున బాగా అరుస్తూ కట్లు విప్పుకొని నర్సింగ్ స్టాఫ్ టేబుల్‌పై ఉన్న సీజర్‌ను పట్టుకొని ఐసీయూలోని తోటి రోగులను భయభ్రాంతులకు గురిచేశాడు. అడ్డుకున్న వైద్య సిబ్బందిని బెదిరిస్తూ ఐసీయూ నుంచి లేబర్ రూంలోకి వెళ్లి లోపలి నుంచి తలుపులు పెట్టుకున్నాడు. అప్రమత్తమైన దవాఖాన సిబ్బంది లేబర్ రూం తలుపుల అద్దం పగులగొట్టి లోపలికి ప్రవేశించి అతడిని పట్టుకొని చికిత్స అందిస్తున్నారు. దీంతో తోటి రోగులు, వైద్యులు ఊపిర పీల్చుకున్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్

బీబీపేట్, జనవరి 15 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజమౌళి

భిక్కనూరు, జనవరి 15 : మండల కేంద్రంలోని పలువురు నిరుపేదలకు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురం రాజమౌళి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి ఎక్కువగా ఉన్నందున పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

# గ్రామాల్లో జోరుగా లిక్కర్ దందా



- పట్టించుకోని సంబంధిత అధికారులు
- మినీ వైన్స్‌లైన బెల్ట్ షాప్‌లు
- కుర్చీలు వేసుకొని మందుబాబుల సిట్టింగ్



బీబీపేట్(దోమకొండ), జనవరి 15 : పలు మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో జోరుగా లిక్కర్ దందా సాగుతున్నది. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దోమకొండ మండల కేంద్రంతోపాటు ముత్యంపేట్, అంబారీపేట్‌లో లిక్కర్‌ను యథేచ్ఛగా విక్రయిస్తున్నా అధికారులకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముత్యంపేట గ్రామంలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డులో ఏకంగా మినీ వైన్స్‌లా ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. దీంతో మందు బాబులు వారికి నచ్చిన బహిరంగ ప్రదేశాల్లో కుర్చీలు వేసుకొని సిట్టింగ్ చేస్తున్నారు. మద్యం మత్తులో సీసాలను అక్కడే పగులగొడుతూ హంగామా చేస్తున్నారు. సంబంధిత అధికారులు లిక్కర్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో బెల్ట్ షాపుల యజమాలు వారికి ఇష్టం వచ్చినట్లు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్లకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపుపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ద్విచక్ర వాహనాలకు ఇనుప తీగలు


### చైనా మాంజా బారిన పడకుండా..



ద్విచక్ర వాహనానికి ఇనుప తీగ బిగిస్తున్న పోలీసులు

కామారెడ్డి, జనవరి 15 : జిల్లా కేంద్రంలో తిరుగుతున్న ద్విచక్ర వాహనదారులకు పతంగులు ఎగరవేయడానికి వాడుతున్న చైనా మాంజా తగలకుండా ఉండేందుకు వీలుగా బుధవారం పోలీసులు ఇనుప తీగలు ముందు భాగంలో బిగించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మాంజా గాని, మరేదైనా దారం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వ్యక్తులకు తగులకుండా ఉంటుందన్నారు. మోటర్ సైకిల్ నడిపే వ్యక్తులు హెల్మెట్ పెట్టుకొని జాగ్రత్తగా నడపాలని, వీలైతే దారం లాంటివి తగలకుండా ఉండేందుకు ఇనుప తీగలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

### బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్, జనవరి 15 : రైతు భరోసా అమలులో లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు. బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో డివిజన్ స్థాయి అధికారులతో రైతు భరోసా అమలుపై బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై ప్రభుత్వం ఇప్పటికే విధి విధానాలను విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అన్నారు. అర్హులైన వారికి రైతు భరోసా అందేలా ఎంపిక ఉండాలని అన్నారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా అమలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని తెలిపారు. సమావేశంలో డివిజన్‌లోని వివిధ మండలాల తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలు, ఎంఆర్‌ఐలు, ఏఆర్‌ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తదతరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న దేవునిపల్లి ఎస్సై రాజు

కామారెడ్డి రూరల్, జనవరి 15 : మండలంలోని గర్గుల్ గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 12 నుంచి నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులను దేవునిపల్లి ఎస్సై రాజు అందజేశారు. కార్యక్రమంలో జీపీఎల్ చైర్మన్ రవితేజాగౌడ్, ఆర్గనైజర్స్ నవీన్, మల్లేశ్, అఖిల్, వినయ్ పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, జనవరి 15 : మండలంలోని లక్ష్మీరావుల పల్లికి చెందిన బల్లె మహేశ్‌కుమార్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి బుధవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

## ద్విచక్ర వాహనం దహనం

భిక్కనూరు, జనవరి 15 : భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దహనం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డిలో ముదాం బల్‌రాజు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి నిప్పంటించడంతో ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎక్కువ రావడంతో ఇంటి పైకప్పుకు కూడా మంటలు అంటుకున్నాయని స్థానికులు తెలిపారు.



పూర్తిగా కాలిపోయిన ద్విచక్ర వాహనం

## క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

నాగిరెడ్డిపేట/లింగంపేట/భిక్కనూరు, జనవరి 15: క్రీడలు యువతలో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెరుగేందుకు దోహదం చేస్తాయని ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజితావెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో నాలుగు రోజులుగా కొనసాగిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విన్నర్‌గా నిలిచిన పోచారం టీమ్‌కు రూ.7,777 నగదు బహుమతితో పాటు కప్, వ్యక్తిగత పతకాలను అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జప్తి జాన్కంపల్లి టీమ్‌కు రూ.5,555 నగదుతో పాటు రన్నర్ కప్, వ్యక్తిగత పతకాలను అందించారు.

**విజేతలకు బహుమతుల ప్రదానం**

లింగంపేట మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల విజేతలకు గ్రామస్తులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రథమ బహుమతి తాడ్వాయి మండల జట్టు గెలుచుకున్నది. విజేతలకు 10వేల రూపాయల నగదుతో పాటు షీల్డు బహూకరించారు. నందివాడ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకోగా వీరికి 5వేల రూపాయల నగదు, షీల్డు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, న్యాయవాది నారాయణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి..**

ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని లింగంపేట ఎస్సై సుధాకర్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం నాగన్న బావి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హేమశ్రీ ప్రథమ బహుమతి 5తులాల వెండి, ఆకుల నవ్య ద్వితీయ బహుమతి 3తులాల వెండి, మౌనిక తృతీయ బహుమతి రెండు తులాల వెండి, బ్రాహ్మణి, సుప్రియ ప్రోత్సాహక బహుమతులుగా కుక్కర్‌లను గెలుచుకున్నారు. వీరితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకూ ఎస్సై సుధాకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కబడ్డీ పోటీలు..**

భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తండ్రి అత్తెలి కిష్టయ్య జ్ఞాపకర్థం మండల స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మాచారెడ్డి మండలం సోమర్‌పేట్ చెందిన టీంకు ప్రథమ, జంగంపల్లికి చెందిన టీమ్‌కు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## ప్రతి ఒక్కరూ పొదుపు చేయడం నేర్చుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డిరూరల్), జనవరి 15 : నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలని సొసైటీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు మన్నె కృష్ణ సూచించారు. ఎల్లారెడ్డి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై కెనరాబ్యాంకు వారి సహకారంతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి పొదుపు రేపటి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరూ బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలు, ఏటీఎం వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## చద్మల్ తండాలో ఘనంగా లక్ష్మమ్మ జాతర

గాంధారి, జనవరి 15: మండలంలోని చద్మల్ తండాలో లక్ష్మమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. చద్మల్ తండాలోని మధుర లంబాడాల ఆరాధ్యదైవం లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రతి ఏడాది మాదిరిగానే సంక్రాంతి రోజున లక్ష్మమ్మ జాతరను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మదేవికి వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞహోమాలు నిర్వహించారు. చద్మల్‌తండాతో పాటు మండలంలోని నేరల్, గుర్జాల్, సిద్ధాపూర్, బీర్మల్, నాగ్లూర్, తిప్పారం, గొల్లాడీ, జెమినితండాలకు చెందిన మధుర లంబాడాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లక్ష్మమ్మను దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లో దుకాణ సముదాయాలు వెలిశాయి.

# ఘనంగా సంక్రాంతి సంబురాలు




పిట్లంలో ముగ్గులు వేస్తున్న మహిళలు




నాగన్నబావి వద్ద ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 15: జిల్లాలో ప్రజలు సంక్రాంతి పండుగను మంగళ, బుధవారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జాము నుంచి మహిళలు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. గొబ్బెమ్మలను పెట్టి నవధాన్యాలు, రేగు పండ్లతో నింపారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించారు. గంగిరెద్దులతో విన్యాసాలు చేయించి వారికి బియ్యం పోశారు. యువకులు తమ ఇండ్ల దాబాలపై పతంగులను ఎరువేస్తూ సందడి చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లల్లో రకారకాల పిండి వంటలను చేసుకున్నారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లో ముగ్గులు, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించి, పోటీల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. సాయంత్రం వేళ ఆడపడుచులు నువ్వుల ఉండలు ఒకరికొకరు పంచుకున్నారు. మహిళలు ప్రతి ఇంటిలో నోములు నోచుకున్నారు.

# రేషన్‌కార్డు అర్హుల గుర్తింపు సర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్



జుక్కల్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట, జనవరి 15: గ్రామాల్లో రేషన్‌కార్డుల కోసం ఎంపిక చేసిన అర్హుల గుర్తింపుపై సర్వే చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. మండలానికి నూతనంగా 633 రేషన్‌కార్డులు మంజూరైనట్లు చెప్పారు. వాటిపై ఈనెల 16 నుంచి 21 వరకు ఎంపికైన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించాలన్నారు. వాటితో పాటు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి కుటుంబాల నుంచి వివరాలు సేకరించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి గుంట భూమి కూడా లేని నిరుపేద కుటుంబాలను గుర్తించాలన్నారు. వారికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ప్రమాణికంగా తీసుకోవాలని సూచించారు. ఈనెల 21 నుంచి 24 వరకు సర్వే చేపట్టి గుర్తించిన వాటిపై గ్రామసభలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

**ప్రతి కుటుంబానికీ కార్డు ఉండాలి..**

లింగంపేట(ఎల్లారెడ్డిరూరల్), జనవరి15: ప్రతి కుటుంబం ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కార్డులు అందించాలని సూచించారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాలి..**

లింగంపేట(తాడ్వాయి), జనవరి15: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ సూచించారు. తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి అమలు చేసే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రహీమొద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహులు, పంచాయతీ అధికారి సరితారెడ్డితో పాటు గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి ..**

బిచ్కుంద, జనవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ హిమబిందు తెలిపారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలోతహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల విధివిధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రాము, తహసీల్ కార్యాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లక్ష్మణ్ దేశాయి (ఫైల్)

మద్నూర్, జనవరి 15 : మండలంలోని సోనాలా రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని గోజేగావ్ గ్రామానికి లక్ష్మణ్ దేశాయి(39) బైక్‌పై వెళుతుండగా మరో బైకుతో ఎదురెదురుగా ఢీకొనడంతో మృతి చెందాడు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**సిద్ధాపూర్ రహదారిపై మరొకరు..**

పెద్దకొడప్‌గల్, జనవరి 15 : సంక్రాంతి పండుగ రోజు పిట్లం మండలంలోని సిద్ధాపూర్ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మద్దెలచెరువు గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాస్ (35)అతని బావ పురుషోత్తం ఇద్దరు కలిసి బైక్‌పై బాచేపల్లి నుంచి మద్దెలచెరువు గ్రామానికి వెళ్తున్నారు. పిట్లం- బాన్సువాడ రహదారి.. సిద్ధాపూర్ రోడ్డు పక్కనే ఆగిఉన్న ఆటోను బైక్ ఢీకొనడంతో బైక్ వెనుక కూర్చున్న శ్రీనివాస్ రోడ్డు పై పడడంతో తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పురుషోత్తంకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గురుకుల విద్యార్థికి గోల్డ్ మెడల్



బంగారు మెడల్ సాధించిన గురుకుల విద్యార్థి ప్రవీణ్

రామారెడ్డి, జనవరి 15: రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగుతున్న 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో కె.ప్రవీణ్ 100 మీటర్ల పరుగుపందెంలో 11.39 సెకన్లలో పూర్తి చేసి జాతీయ స్థాయిలో రికార్డు నెలకొల్పి బంగారు పతకం సాధించినట్లు కోచ్ సురేశ్ బుధవారం తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ శివారాం, పీఈటీ మహేశ్ తదితరులు అభినందించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు అందజేత

రామారెడ్డి, జనవరి15 : మండలంలోని మోడెగాం గ్రామస్తులు తమ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బుధవారం విరాళం అందజేశారు. స్థానిక ఎస్సై రంజిత్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై ఆధ్వర్యంలో టెక్నీషియన్‌కు 50వేల రూపాయలు అందజేశారు.

## నేడు రక్తదాన శిబిరం

లింగంపేట, జనవరి15: లింగంపేట మండల కేంద్రంలోని హైకోర్టు న్యాయవాది మోమిన్ అహ్మద్ ఖాద్రీ ఫాం హౌస్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనునట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ప్రజలకు ప్రయాణ సమయంలో హెల్మెట్ వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీఐ వెంట స్థానిక ఎస్సై సుధాకర్ పోలీసు సిబ్బంది ఉన్నారు.